పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● నర్సింగ్‌పల్లిలో వైద్యుల బృందం పర్యటన



నర్సింగ్‌పల్లిలో మందు స్ప్రే చేయిస్తున్న వైద్యులు, ఎంపీడీవో

మోపాల్(నిజామాబాద్‌రూరల్): గ్రామాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు బృందం సూచించింది. మండలంలోని నర్సింగ్‌పల్లిలో వైరల్ ఫీవర్లు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమై నాలుగు బృందాలను పంపించింది. బృందాలు గ్రామం మొత్తం కలియ తిరిగి ప్రజలకు అప్రమత్తం చేస్తూ, అవగాహన కల్పించారు. ముఖ్యంగా వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేస్తూ, స్ప్రే చేశారు. డ్రై డే నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వైద్యులు సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బందిసైతం ప్రతిరోజూ చెత్త సేకరించాలని, ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయాలన్నారు. లార్వా నిరోధక చర్యలు చేపట్టారు. అదేవిధంగా గ్రామంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులను అందజేశారు. మెరుగైన చికిత్సలు అవసరమున్న వారికి జీజీహెచ్‌కు సిఫారసు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాములు నాయక్, వైద్యులు డాక్టర్ రాజు, డాక్టర్ నాగరాజు, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ అజ్మల్, డాక్టర్ ప్రత్యూష, హెచ్ఈఓ గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి,జీపీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీలో పేరుకున్న వ్యర్థాలు

● ఆర్టీసీ కాలనీలో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
● మున్సిపల్ అధికారులు స్పందించాలని వినతి



ఆర్టీసీ కాలనీ వద్ద డ్రెయినేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు



డ్రెయినేజీ వెంబడి పెరిగిన పిచ్చిమొక్కలు

నిజామాబాద్‌అర్బన్ : నగరంలోని ఆర్టీసీ కాలనీలో హనుమాన్ ఆలయ రోడ్డులో గల మండి హోటల్ ఆహార వ్యర్థాలను స్థానిక డ్రెయినేజీలో పేరుకుపోయాయి. దీంతో కాలనీవాసులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ కాలనీలో ప్రధాన రోడ్డుకు ఆనుకొని మండీ హోటల్ కొనసాగుతుంది. ఆర్టీసీ కాలనీ వెనుక వైపు ఉన్న నివాస గృహాల మధ్య గల డ్రెయినేజీలోకి హోటల్ నుంచే వచ్చే వ్యర్థాలను మురుగు నీరు పైపులైన్‌ను కలిపారు. ఈడ్రెయినేజీ నుంచి మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో వ్యర్థాలు డ్రెయినేజీల్లో పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన రావడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయమై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.అలాగే డ్రెయినేజీలను మున్సిపల్ సిబ్బంది శుభ్ర పర్చడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలోని పలు డ్రెయినేజీల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి మురుగు నీరు అక్కడే నిలుస్తోంది. వర్షం పడిన సమయంలో ఇంటిముందు, రోడ్డు ముందు హోటల్ వ్యర్థాలు నీటితో పాటు బయటకు వస్తున్నాయి. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. హోటల్ నుంచే వచ్చే వ్యర్థాలను ప్రధాన డ్రెయినేజీలో కలపాలని కాలనీవాసులు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

ఆర్టీసీ కాలనీలో డ్రెయినేజీ నుంచి దుర్వాసనతో రావడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. డ్రెయినేజీలు శుభ్రపర్చడంలేదు. అధికారులు పట్టించుకోవాలి. – దీరాజ్, ఆర్టీసీ కాలనీ

దుర్వాసన వస్తుంది

మండి హోటల్ వ్యర్థాలతో కాలనీవాసులం ఇబ్బందులు పడుతున్నాం. డ్రెయినేజీలో వ్యర్థ పదార్థాలు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తుంది. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది.

–శ్రీనివాస్, ఆర్టీసీ కాలనీ

పరిశీలించి నోటీసులు ఇస్తాం

ఆర్టీసీ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థను మున్సిపల్ సిబ్బంది పరిశీలిస్తారు. అనంతరం హోటల్ నిర్వహకులకు నోటీసులు జారీ చేస్తాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

–దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



సిర్‌పూర్‌లో జెండా ఆవిష్కరించిన నాయకులు



సిరికొండలో ..

మోపాల్/సిరికొండ : మోపాల్ మండలకేంద్రంతో పాటు సిర్‌పూర్, ముదక్‌పల్లి గ్రామాల్లో, సిరికొండ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకను నిర్వహించి కేక్‌కట్ చేసి పంచిపెట్టారు.ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి ఇరుగు పైడి మాదిగ,మోపాల్ ఇన్‌చార్జి రొడ్డ ప్రవీణ్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిప్పెర సంజీవ్, సిరికొండ మండల అధ్యక్షుడు మొట్టల దీపక్ సంపత్ ఉన్నారు.

ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ : కార్మిక శాఖ విడుదల చేసిన జీవో నంబర్ 282ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనంచేశారు. సోమవారం ఉదయం ధర్నాచౌక్ వద్ద నాయకులు నిరసన తెలిపారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వై.ఓమయ్య, టీయూసీఐ జిల్లా కార్యదర్శి ముస్కె సుధాకర్, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు జి.భూమయ్య మాట్లాడారు. జీవో నంబర్ 282లో వాణిజ్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగులతో, కార్మికులతో రోజుకు 10 గంటలు పనిచేయించుకోవచ్చని, వారానికి 48 గంటలు మించకూడదని ఉందన్నారు. కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సాయన్న, రాములు, రవి, ఇమ్రాన్ అలీ, ప్రసాద్, కిరణ్, సురేష్, నవీన్, లక్ష్మీ, సాయిలు, నరసయ్య, గంగాధర్, గంగారం తదితరులు పాల్గొన్నారు.

భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాయన్న కుటుంబీకులు

మోపాల్: మండలంలోని మంచిప్ప శివారులో ఎస్సీ కార్పొరేషన్ తమకు ఇచ్చిన 0.39 గుంటల భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని చాట్ల సాయన్న కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితుడు చాట్ల సాయన్న తెలిపిన వివరాల ప్రకారం 0.39 ఎకరాల భూమిలో తన తండ్రి మాద్గి ఎల్లయ్య బతికి ఉన్నన్ని రోజులు వ్యవసాయం చేశాడని తెలిపారు. కొద్ది రోజులుగా తమ భూమికి పక్కన భూమి కలిగిన ఈదుల్ల గంగారాం, ఆయన అల్లుడు ఈదుల్ల ప్రవీణ్ కబ్జా చేసుకున్నారని ఆరోపించారు. తమను బెదిరిస్తున్న ఈదుల్ల గంగారాం, ఈదుల్ల ప్రవీణ్‌పై చర్యలు తీసుకోవాలని, తమ భూమిని ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. మోపాల్ తహసీల్దార్‌ను పరిశీలించాలని ఆదేశించినట్లు సాయన్న తెలిపారు. కార్యక్రమంలో పల్లాటి సాయిలు, కొంగల మౌనిక, పర్వవ్వ, డప్పు సుజాత, డప్పు బుచ్చమ్మ, చాట్ల బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువతపైనే దేశ భవిష్యత్



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌ఐ అనిల్‌రెడ్డి

కమ్మర్‌పల్లి/బోధన్‌టౌన్ : దేశ భవిష్యత్ యువతపైనే ఉందని కమ్మర్‌పల్లి ఎస్‌ఐ అనిల్‌రెడ్డి అన్నారు. సోమవారం కమ్మర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'మత్తు పదార్థాల నియంత్రణ' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మత్తుకు బానిసకావొద్దని సూచించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు మధు, రాజ్‌కుమార్, వెంకటేష్, గంగారాం, మహేందర్, స్వాతి తదితరులు పాల్గొన్నారు. మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని బోధన్ పట్టణ ఎస్సై వెంకట నారాయణ అన్నారు. పట్టణంలోని విద్యావికాస్ జూనియర్ కాలేజీలో మత్తు పదార్థాల నియంత్రణ అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం షీ టీం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు విఘ్నేష్, సుమతి మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలను ఉదాహరణలతో విద్యార్థులకు వివరించారు.

ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

నిజామాబాద్‌అర్బన్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుంచి ధర్నా చౌక్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. అనిల్ మాట్లాడుతూ పెండింగులో ఉన్న సుమారు రూ. 8వేల కోట్ల ఫీజుఎయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో పుస్తకాల పంపిణీ ఇంకా పూర్తి కాలేదన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గాప్రసాద్, కోశాధికారి నిఖిల్, జిల్లా నాయకులు సృజన్, నిశాంత్, మహేందర్, చరణ్, ప్రమోద్, స్వరాజ్, సిద్ధార్థ్, పల్లవి, రాజశ్రీ, రమ విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

సిరికొండ : మండలంలోని గడ్కోల్ గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రారంభించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి భవన నిర్మాణానికి రూ. 12 లక్షల నిధులను మంజూరు చేయించారని వారు తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంపత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ లింబాద్రి, రవి నాయక్, ప్రసాద్, భాస్కర్ రెడ్డి ,అఖిల్ యాదవ్ ,భానుచందర్ ,నీరజ్ రెడ్డి, జీవన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

9న సాయిబాబా ఆలయంలో వంట సామగ్రి బహిరంగ వేలం

నిజామాబాద్ రూరల్ : మండలంలోని సాయిబాబా ఆలయంలో టెంట్ హౌస్ వంట సామగ్రి కోసం ఈనెల 9న వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీరామ్ రవీందర్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. 2025–27 సంవత్సరాల గాను దేవాలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు పాల్గొనాలని కోరారు.

డిచ్‌పల్లి సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ల బిగింపు



డిచ్‌పల్లి: మండల కేంద్రం శివారులో గల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా రెండు బ్రేకర్లను బిగిస్తున్నారు. ఈ బ్రేకర్ల బిగింపు సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డిచ్‌పల్లి రైల్వేస్టేషన్, బీబీపూర్ తండ, ఘన్‌పూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అయితే సుద్దపల్లి నుంచి లైను తీసుకుని డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ కు కొద్ది సేపు విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు ట్రాన్స్‌కో ఏఈ గంగారాం తెలిపారు. బ్రేకర్ల బిగింపు పనులు జరుగుతుండగా వర్షం రావడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. సోమవారం సాయంత్రానికి ఒక బ్రేకర్ ఏర్పాటు పూర్తి కాగా, మంగళవారం రెండో బ్రేకర్ పనులు కొనసాగుతాయని ఏఈ తెలిపారు. మంగళవారం సైతం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణలో మందకృష్ణ కృషి



నిజామాబాద్ అర్బన్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు చట్టబద్ధతకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఎనలేకి కృషి చేశారని, ఆయనకు మాదిగ జాతి రుణపడి ఉంటుందని మాదిగ ఉద్యోగులు అన్నారు. మందకృష్ణ పుట్టిరోజు సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో డ్రీమ్‌ల్యాండ్‌లో ఆయనను జిల్లా మాదిగ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలుమల సురేష్, ఉద్యోగులు నాంపల్లి, సందీప్ సోంనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు తెయూలో క్యాంపస్ సెలెక్షన్స్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఈనెల 9న తెయూ కెమిస్ట్రీ విభాగం, ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీ హెటిరో సంయుక్తంగా క్యాంపస్ సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు కెమిస్ట్రీ విభాగాధిపతి సాయిలు ఒక ప్రకటనలో తెలిపారు. తెయూ పరిధిలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన వారితో పాటు ఈ విద్యా సంవత్సరం ఫైనలియర్ విద్యార్థులు క్యాంపస్ సెలెక్షన్స్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. అభ్యర్థులకు రాతపరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి నియామక ఉత్తర్వులు అందజేస్తారని ఆయన తెలిపారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు నగదు అందజేత



ధర్పల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి మూత రాజకుమార్ నగదును అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన నరేష్‌కు రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన కల్యాణ్ కు రూ.3 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

కోచ్ ఎస్సాముద్దీన్‌కు అభినందనలు



నిజామాబాద్ నాగారం: జిల్లాకు చెందిన బాక్సింగ్ కోచ్ ఎస్సాముద్దీన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాక్సింగ్ మహిళ టోర్నమెంట్ కజకిస్తాన్ దేశంలో జూన్ 30 నుంచి ఈనెల వరకు జరిగింది. ఈటోర్నమెంట్‌లో మనదేశ క్రీడాకారులు మూడు బంగారు, రెండు వెండి, ఒక కాంస్య పతకాలు గెలుచుకున్నారు. ఈసందర్భంగా కోచ్‌గా వ్యవహరించిన ఎస్సాముద్దీన్ ఆధ్వర్యంలో దేశానికి పతకాలు రావడంపై మాజీ అథ్లెట్ సయ్యద్ కైసర్, క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలుపుతున్నారు.

సార్వత్రిక సమ్మెకు మద్దతు



నిజామాబాద్ సిటీ : ఈనెల 9న నిర్వహిస్తున్న సార్వత్రిక దేశవ్యాప్త సమ్మెకు తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్, యుఎస్ఎఫ్ఐ మద్దతు తెలుపుతుందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు బి. సూర్యశివాజీ, యూఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గణేష్ తెలిపారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సూర్యశివాజీ, పార్టీ కార్యాలయంలో గణేశ్ మాట్లాడారు. వ్యవసాయరంగంలో స్వామినాథన్ సిఫార్సులను అమలు పరచాలని, ఉపాధిహామీ కూలీలకు రూ. 600 వేతనం ప్రకటించి, ఏడాదికి 200 పని దినాలను కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, వి.పద్మ, సుప్రియ, పోశెట్టి, ఎల్.లక్ష్మి, అబ్దుల్, కవిత, భాను, ధనలక్ష్మి, గణేష్, వేణు, మహేష్, సందీప్, కిరణ్, విశాల్, శివాజీ పాల్గొన్నారు.

గుంజిళ్లు తీయడం శిక్ష కాదు



మోర్తాడ్: గుంజిళ్లు తీయడం శిక్ష కాదని అదొక సూపర్ బ్రెయిన్ యోగా అని రిటైర్డు అధ్యాపకులు అందె జీవన్‌రావు అన్నారు. సూపర్ బ్రెయిన్ యోగా అనే అంశంపై సోమవారం భీమ్‌గల్ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు గుంజిళ్లు తీయడంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. గుంజిళ్లు తీయడం వల్ల విద్యార్థులలో ఒత్తిడి తగ్గి జ్ఞాపక శక్తి పెరుగుతుందని చెప్పారు. ప్రతి విద్యార్థి రోజుకు తమకు వీలైనన్ని గుంజిళ్లు తీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో స్వామి, ఉపాధ్యాయులు గట్టు ఈశ్వర్, రాజు, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం



గూపన్‌పల్లికి వెళ్లే దారిలో బ్రిడ్జిపై లేని సైడ్‌వాల్

అదుపుతప్పితే....అంతే

నగరంలోని గూపన్‌పల్లికి వెళ్లే దారిలో బ్రిడ్జిపై ఎలాంటి సైడ్‌వాల్ నిర్మించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సైడ్‌వాల్ లేకపోవడం, బ్రిడ్జిపక్కన పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. అధికారులు స్పందించి బ్రిడ్జికి ఇరువైపులా సైడ్‌వాల్ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

మాకు ఫొటో పంపండి — మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 | నిజామాబాద్ రూరల్ - 97053 46541

గుమస్తా సంఘం అధ్యక్షుడిగా లాండేరి బాల్ అంజయ్య



నూతన కార్యవర్గ సభ్యులు

సుభాష్‌నగర్: నగరంలోని శ్రద్ధానంద్ గంజ్ గుమస్తా సంఘం అధ్యక్షుడిగా లాండేరి బాల్ అంజయ్య (బాలు) విజయం సాధించారు. సోమవారం నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో గుమస్తా సంఘం ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరగగా, ప్రత్యర్థి కొక్కు నర్సయ్యపై లాండేరి బాల్ అంజయ్య 134 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. బాల్ అంజయ్య గతంలో సంఘానికి కార్యదర్శిగా ఉన్నారు. అలాగే కార్యదర్శిగా గట్ల శ్రీనివాస్, కోశాధికారిగా వెంకటేష్, ఉపాధ్యక్షులుగా రాజ్ గణేష్, సంయుక్త కార్యదర్శిగా శివప్రసాద్ ఎన్నికయ్యారు. అనంతరం గంజ్‌లో విజయోత్సవం సంబురాలు నిర్వహించారు. స్వీట్లు తినిపించి, టపాకాయలు కాల్చారు. నూతన అధ్యక్షుడు బాల్ అంజయ్యతోపాటు ఎన్నికైన కమిటీ సభ్యులకు నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, అధికారులు, వ్యాపారస్తులు శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా ఈ కమిటీ రెండేళ్లపాటు కొనసాగనుంది.

నిజామాబాద్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా బిల్లా మహేష్

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం(అఖిల భారత పద్మశాలి సంఘం అనుబంధం) రాష్ట్ర సర్వసభ సమావేశం ఆదివారం యాదాద్రి జిల్లాలో జరిగింది. ఇందులో అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి ఆదేశానుసారం, రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్తపు మురళి నిజామాబాద్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా బిల్లా మహేష్‌కు నియామకపత్రం అందజేశారు. పద్మశాలి ఐక్యతకు పాటుపడాలని, సంఘాల అభివృద్ధి కోసం నిరంతరంగా కృషి చేయాలని రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు మురళి సూచించారు. కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి రామచంద్రారావు, ,ఎస్.ఆర్.సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడిగా లక్ష్మణ్



జక్రాన్‌పల్లి గ్రామ శాఖ కాంగ్రెస్ సభ్యులు

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా సొప్పరి సుధీర్‌లను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడి ఆదేశానుసారం జక్రాన్‌పల్లిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, అర్గుల్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, మాజీ సర్పంచ్ నర్సారెడ్డి, నాయకులు సొప్పరి వినోద్, నట్ట తిరుపతి, బొంబాయి రాజు, అనిల్, శ్రీనివాస్, సాయిలు,బుయ్య గంగాధర్, గన్న శ్రీనివాస్, అనిల్, గన్న గంగారాం, పోశెట్టి, శంకర్, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదుపై బీఎల్వోలకు అవగాహన



సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో రాజేంద్ర కుమార్

ఇందల్వాయి : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ నమోదు కార్యక్రమంపై బూత్ లెవెల్ ఆఫీసర్లకు సోమవారం ఆర్డీవో రాజేంద్ర కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు పొందేలా అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు బీఎల్వోలు కృషి చేయాలని సూచించారు. ఓటు హక్కు పొందేందుకు అవసరమైన ధృవపత్రాల వివరాలను వారికి తెలియజేయాలన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేలా జాగ్రత్త పడాలని అధికారులకు సూచించారు. మార్పులు చేర్పులు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట్రావు, డిప్యూటీ తహసీల్దార్ శైలజ, ఆర్ఐ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,700	వెండి(కిలో)	1,11,500
22 క్యారెట్స్	90,187	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	50	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	90
బీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	100	150	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	40	60
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	50	80	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	30	50
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	50	80
పుదీనా	60	90	గోరుచిక్కుడు	30	60
క్యాప్సికం	50	90			

–సుభాష్‌నగర్